## క్లుప్తంగా

### ద్విచక్ర వాహనాల వేలం


వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

**కళ్యాణదుర్గం రూరల్:** పలు కేసుల్లో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెట్ రవికుమార్ ఆధ్వర్యంలో వేలం వేశారు. వేలంలో సుమారు 30 మంది పాల్గొన్నారు. వేలం ద్వారా రూ. 2,47,446 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణానాయక్, ఎస్‌ఐ పీఎల్ఎస్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

### ‘లైన్‌మెన్‌ను నియమించాలి’

**కుందుర్పి:** మండలంలోని జంబుగుంపల పంచాయతీకి లైన్‌మెన్‌ను నియమించాలని సోమవారం ట్రాన్స్‌కో ఏఈ జయకృష్ణకు రైతులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ ఔట్‌సోర్సింగ్ కింద తిప్పేస్వామి పనిచేస్తున్నారని, పంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు దెబ్బతింటే లైన్‌మెన్ లేని కారణంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి లైన్‌మెన్‌ను నియమించాలని రైతులు రామూర్తి, నాగరాజు, ఆంజనేయులు, రామప్ప కోరారు.

### పెన్షనర్ల అసోసియేషన్‌కు విరాళం


విరాళాలను అసోసియేషన్ సభ్యులకు అందజేస్తున్న దాతలు

**కళ్యాణదుర్గం:** పెన్షనర్ల అసోసియేషన్‌కు దాతలు విరాళం అందించారు. స్థానిక పెన్షనర్ల భవనంలో సోమవారం కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ గౌరీశంకర్, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ గంగాధర్‌శెట్టి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ నరసింహమూర్తి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని పెన్షనర్ల సంక్షేమానికి వినియోగించాలని దాతలు సూచించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామి, సభ్యులు అంజినప్ప, మారెన్న, సీసీ రెడ్డి, లింగప్ప, ఫకృద్దీన్, నాగభూషణ, సత్యేంద్ర, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### జ్వరాలు ప్రబలకుండా చర్యలు


రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యుడు

**కుందుర్పి:** జడివానల నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలకుండా మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వ వైద్యాధికారుల బృందం వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందిస్తున్నారు. సోమవారం బెస్తరపల్లి, మహంతపురం తదితర గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరాల బారిన పడిన వారికి చికిత్స అందజేశారు. డెంగీ, మలేరియా లక్షణాలుంటే సత్వరం చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణస్వామి, సోమేష్‌కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

### భద్రత కల్పించాలని వినతి

**కళ్యాణదుర్గం రూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని కురాకుల తోట లే అవుట్‌లో పరికరాలకు భద్రత కల్పించాలని కాలనీవాసులు కోరారు. స్పందనలో భాగంగా సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు రాజు, జయలక్ష్మి, నరసింహులు, బాషా మాట్లాడుతూ కొన్ని రోజులుగా లే అవుట్‌లో ఇళ్ల ముందు ఉన్న పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి


‘జగనన్న గోరుముద్ద’ను పరిశీలిస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు ఓబుళపతి, క్రిష్టానాయక్ సూచించారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్దను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా సరికొత్త మెనూ ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, సీఆర్పీ గోపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మొహర్రం సందడి


కళ్యాణదుర్గం: కటిక వీధిలో కొలువుదీరిన పీర్లు


వజ్రకరూరు: గూళ్యపాళ్యంలో పూజలందుకుంటున్న పీర్లు


కూడేరు: ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన పీర్లు


బొమ్మనహాళ్: పూజలందుకుంటున్న పీర్లు

- కొలువుదీరిన పీర్లు
- మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

**కళ్యాణదుర్గం:** పట్టణంలోని కటికవీధిలో మత సామరస్యాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అలీ, అక్బర్ సాహెబ్ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 29న పానకాలు, 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జలధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కొలిమి దాదాపీర్, నూరుల్లా తెలిపారు.

**బొమ్మనహాళ్:** మండల వ్యాప్తంగా సోమవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, దర్గాహొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం, శిద్దరాంపురం, గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో మొహర్రం వేడుకలకు వివిధప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

**కూడేరు:** మండల కేంద్రంలోని పీర్ల చావిడిలో సోమవారం పెద్ద వన్నూరుస్వామి, కుళ్లాయిస్వామి, చిన్న వన్నూరుస్వామి, బొడ్డుస్వామి, కబడి పీర్, బుర్రా బాబయ్య పీర్లతో పాటు ఇతర పీర్ల దేవుళ్లు కొలువుదీరాయి. ముజువార్ నిషార్ పీర్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. శనివారం పానకాలు, ఆదివారం జలధి నిర్వహించనున్నారు.

**వజ్రకరూరు:** మండలంలోని గూళ్యపాళ్యం లాలుస్వామి ఆలయంలో పెద్దలాలుస్వామి, చిన్నలాలుస్వామి,పెద్ద హుసేన్‌స్వామి, చిన్నహుసేన్‌స్వామి, ఖాసీమ్‌స్వామి, బర్జిస్వామి తదితర పీర్లు సోమవారం కొలువు తీరాయి. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు షరీఫ్‌బాషా, అహమ్మద్‌హుస్సేన్, రహమాన్ మాట్లాడుతూ 29వ తేదీ పీర్లను జలధికి తరలిస్తామన్నారు.

## పెద్దదేవర పీర్ల చావిడి ప్రారంభం


పీర్లచావిడిని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**కణేకల్లు:** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో నూతనంగా నిర్మించిన పెద్దదేవర పీర్లచావిడిని సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. పీర్లచావిడి పాతబడటంతో పెద్దదేవర సోదరులు కొత్త పీర్లచావిడిని నిర్మించారు. చావిడిని విప్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పెద్దదేవర మాబుపీరా, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, నాయకులు పాల్గొన్నారు.

### ‘జలజీవన్ మిషన్’పై నేడు సమావేశం

**విడపనకల్లు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జలజీవన్ మిషన్ పథకంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ సోమవారం తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరు కావాలన్నారు.

### తక్షణ సాయం అందజేత

**విడపనకల్లు:** మండలంలోని వి.కొత్తకోట గ్రామంలో సోమవారం చాకలి వరలక్ష్మి(45) అనారోగ్యంతో మృతి చెందడంతో తక్షణ సాయం కింద చాకలి లాలుస్వామికి రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవేంద్ర, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఘనంగా ‘అయ్యంకి’ జయంతి

**వజ్రకరూరు:** స్థానిక గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పంచాయతీ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు

### ఎస్‌ఐకి సన్మానం

**వజ్రకరూరు:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం నూతన ఎస్‌ఐ రాజశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు సురేంద్ర, అట్టిల హరి, ఎద్దాటి రమేష్ తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

## అవినీతి, దోపిడీకి మారుపేరు ‘కాలవ’


మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజునాయక్

**డి.హీరేహాళ్(రాయదుర్గంటౌన్):** అవినీతి, దోపిడీకి మారుపేరు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అని మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజు నాయక్ విమర్శించారు. ఇటీవల డి.హీరేహాళ్ మండలంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనతోపాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండించారు. సోమవారం మండల కేంద్రమైన డి.హీరేహాళ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. ఇసుక దందాలో రూ.కోట్లు కొల్లగొట్టి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాజీ మంత్రి కాలవ వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడం సిగ్గు చేటన్నారు. ప్రజల్లో ఆదరణ లేక రాజకీయ మనుగడ కోసం కాలవ గ్రామాల్లో చిచ్చు రేపే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టేలా మాట్లాడుతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఓ గిరిజన నాయకుడికి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో జీర్ణించుకోలేక తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. ఇసుక దోపిడీ చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్న కాలవ శ్రీనివాసులు..దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా కాలవ పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సచివాలయల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు మరింత వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న

**బెళుగుప్ప:** మండలంలోని సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని ఎంపీపీ పెద్దన్న సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్పతో కలసి వారు సర్పంచ్‌లు ఎంపీటీసీలు పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో గుర్తించిన పనులకు రూ.20 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.2.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే ప్రతి ఎంపీటీసీ పరిధి, పంచాయితీ పరిధిలో కలిపి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.60 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిదులు రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటితోపాటు జెడ్పీ నిధులు ఎన్‌ఆర్ఈజీఎస్ నిధులు కలిపి మరో రూ.2 కోట్ల వరకు ప్రభుత్వం మండలానికి కేటాయించిందన్నారు. ఆ నిధులను ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా పనులకు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హర్షవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీరాములు, జగదీష్, గోపాల్, వెంకటేశులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

### ఏపీజీబీలో నగదు కొరత



**గుమ్మఘట్ట:** మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ)లో నగదు కొరతతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతుల ఖాతాలకు బీమా, రైతు భరోసా, విద్యార్థుల తల్లుల ఖాతాలకు అమ్మఒడి, మహిళలకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు వంటి పథకాలకు సంబంధించి నగదు జమచేస్తుండడంతో .. నగదును డ్రా చేసుకోవడానికి సంతోషంగా రైతులు, మహిళలు బ్యాంకుకు తరలివస్తున్నారు. బ్యాంకు గేటు ముందు నో క్యాష్ బోర్డు పెట్టడంతో ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మేనేజర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఖాతాదారులు ఒకేసారి బ్యాంకుకు రావడంతో కొంత ఇబ్బందిగా ఉంది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నగదు సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.

### 27న మున్సిపల్ సమావేశం

**రాయదుర్గంటౌన్:** పురపాలకసంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాలవారిగా అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

### విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు

**కుందుర్పి:** స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో కుందుర్పి, కంబదూరు మండలాల్లోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన వారికి ఆర్డీటీ ఏటీఎల్ నారాయణస్వామి, హెచ్ఎం కిష్టప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.


వర్షంలోనే ప్రయాణం

### • వదలని జడివాన!

**రాయదుర్గంటౌన్:** నియోజకవర్గంలో దాదాపు ఆరు రోజుల నుంచి చిరుజల్లులు, తేలికపాటి, జడివాన పట్టుకుంది. అంతేకాక అప్పుడప్పుడు జోరు వానతో మురిపిస్తున్నాడు వరుణుడు. వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటి గాలులతో చలికాలాన్ని తలపిస్తోంది. ఈ నెల 19వ తేదీ నుంచి సోమవారం వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది.


ఒక చేత్తో గొడుగుతో వర్షంలో రయ్..రయ్

## సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**రాయదుర్గం రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని టి.వీరాపురంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, జెడ్పీటీసీలు హొన్నె మల్లికార్జున, పీఏస్ మహేష్ , సర్పంచ్ ఓబుళమ్మతో కలసి సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుజల్లులు కురుస్తున్నా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటిముంగిటకే పింఛన్ అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్ కావాలంటే మూడు , నాలుగు రోజులు పంచాయతీ కార్యాలయం వద్ద లేదా రచ్చకట్టల వద్ద వృద్ధులు, వికలాంగులు పడిగాపులు కాసేవారని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఒక్కో కుటుంబం రూ.50 వేల నుంచి రూ.10 లక్షలకు పైగా లబ్ధి పొందిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు. అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలు చేసి వంచించే టీడీపీ నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. గత టీడీపీ పాలనలో ఇల్లు మంజూరు కోసం రూ.30 వేలు ముడుపులు ఇచ్చుకున్నామని ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ప్రభుత్వ విప్ తో మొరపెట్టుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నయా పైసా లంచం లేకుండా ఇల్లు మంజూరు అయ్యాయని, బిల్లులు కూడా వెంటనే పడుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కోఆప్షన్ సభ్యులు దిలావర్ బాషా, బోర్‌వెల్ నాగిరెడ్డి, కొండాపురం, ఉడేగోళం సొసైటీ అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, భీమన్న, కణేకల్లు టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, గౌని లక్ష్మీకాంతారెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, గోవిందవాడ లోకేష్ , ఆనందరెడ్డి, కణేకల్లు మండల సచివాలయాల కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీ రాజమ్మ, అరుణ్ కుమార్, మెచ్చిరి చంద్ర, మల్లాపురం చంద్రశేఖర్ రెడ్డి, కూర్మారెడ్డి, వెంకటరామిరెడ్డి, సుధాకర్ గౌడ్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### ‘స్పందన’పై అధికారుల నిర్లక్ష్యం

**కూడేరు:** సమస్యల పరిష్కారం కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం పట్ల మండల అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించారు. కేవలం నాలుగు శాఖల అధికారులే హాజరయ్యారు. అందులో తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ ఉన్నారు. మిగిలిన అధికారులు గైర్హాజరయ్యారు. అర్జీలిచ్చేందుకు వచ్చిన వారు అధికారుల తీరు చూసి ప్రజా సమస్యలంటే అధికారులకు ఇంత చులకనా అని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని మండలవాసులు కోరారు.

### వేగవంతంగా రీ సర్వే


కరకముక్కల పొలాల్లో భూ రీసర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

**విడపనకల్లు:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన భూ రీసర్వే వేగవంతంగా సాగుతోందని తహసీల్దారు ఈరమ్మ అన్నారు. సోమవారం మండలంలోని కరకముక్కల, హంచనహాల్, ఎన్.తిమ్మాపురం, గడేకల్లు తదితర గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పొలాల్లో రీ సర్వే చేపట్టారు. కరకముక్కల గ్రామంలో దాదాపు 55 మంది రైతులకు చెందిన 400 ఎకరాలు రీ సర్వే చేసినట్లు తహసీల్దారు తెలిపారు. సర్వేయర్ మురళి, రంగస్వామి, వీఆర్వో నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘సురక్ష’తో ప్రజల చెంతకే సేవలు


వెలిగొండలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**ఉరవకొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారని ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని వెలిగొండ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వారం రోజుల పాటు తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో గ్రామ సచివాలయాల్లోనే జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు వారి గ్రామాల్లోనే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, సర్పంచ్ వీరాంజనేయులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, మూలగిరిపల్లి ఓబన్న, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, నాయులు ముస్తూరుబాబు, ఈడిగ ప్రసాద్, వన్నూర్‌సాబ్, నాగప్ప, శివ, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

### నేడు ‘జగనన్న సురక్ష’

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 5, 6వ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు దబ్బడి కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్‌లు, కౌన్సిల్ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అర్హులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అర్హులకు అందజేస్తారన్నారు.

**కూడేరు:** మండలంలోని చోళసముద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగభూషణరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రజలంతా హాజరై సర్టిఫికెట్లను పొందాలని ఆయన సూచించారు.

**గుమ్మఘట్ట:** మండలంలోని గోనబావిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

**శెట్టూరు:** మండల కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్, ఈఓఆర్డీ రఘురామరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బ్రహ్మసముద్రం:** మండలంలోని ఎరడికెర గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దాసానాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**వజ్రకరూరు:** మండలంలోని పీసీ ప్యాపిలిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయలలిత, సర్పంచు జ్యోతిభాయి తెలిపారు.సోమవారం వైస్ ఎంపీపీ సుంకమ్మ, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంఎల్ఓ తేజేశ్వరరెడ్డి తదితరులతో కలసి వారు పీసీ ప్యాపిలిలో ఏర్పాట్లను పరిశీలించారు.

### సంఘాల బలోపేతానికి కృషి చేయండి

**కూడేరు:** మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని మండల విజేత సమాఖ్య అధ్యక్షురాలు గంగమ్మ, ఏపీఎం రాజశేఖర్ సూచించారు. సోమవారం కూడేరులోని వైకేపీ కార్యాలయంలో గ్రామైఖ్య సంఘ లీడర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోకోస్ యాప్‌లో సంఘ సభ్యురాళ్ల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని యానిమేటర్లకు ఆదేశించారు. స్త్రీ నిధి రుణాల రికవరీని పక్కాగా చేయించాలని సీసీలకు సూచించారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులొస్తే శాఖా పరమైన చర్యలుంటాయని ఏపీఎం హెచ్చరించారు.

### అర్జీలపై నిర్లక్ష్యం వీడండి

**కళ్యాణదుర్గం:** ‘స్పందన’ అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని పలు గ్రామాల్లో రస్తా, భూ సమస్యలు, ఇంటి స్థలం తదితర సమస్యలపై పలువురు అర్జీదారులు ఆర్డీఓ వద్ద వినతిపత్రాలు అందజేసి మొరపెట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ అర్జీదారులు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదన్నారు పేదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలని ఆర్డీఓ సూచించారు.